క్లుప్తంగా

బియ్యం అందజేత



జనగామ రూరల్: గుండాల మండలం బురుజువాయి గ్రామానికి చెందిన సీహెచ్ వేణు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం శామీర్‌పేట గ్రామంలోని రుద్రమదేవి వృద్ధాశ్రమంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెనమణి కుమార్, ఆశ్రమ నిర్వాహకులు సుంకరి దేవేందర్, కొయ్యడా రవి, పండుగ నరేష్ ఉన్నారు.

నిత్యావసరాల..



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని చెందిన చిట్యాల యాకన్న(డ్రైవర్) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆదివారం పాలకుర్తి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుడిపెల్లి సోమయ్య సహకారంతో 25 కేజీల బియ్యం, కూరగాలు, నిత్యావసరాలు అందజేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, క్యాదర్శి జీడీ హరిష్, కోశాధికారి ఓర్రె కుమారస్వామి పాల్గొన్నారు.

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన తాటికొండ చిరంజీవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇల్లందుల రాజనారాయణ 50 కిలోల బియ్యం అందజేశారు. ముందుగా చిరంజీవి చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సింగపురం రమేష్, చింత తిరుపతి, నీరటి రత్నాకర్, గట్టు చిరంజీవి, మురళి, లింగయ్య, మొగిలి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పనిచేసే వారిని గెలిపించండి

చిల్పూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో నిస్వార్థంగా ప్రజల కోసం పని చేస్తున్న కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి కుమారస్వామి పిలుపునిచ్చారు. లింగంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుకు నోటు పంచే వారిని ఓడిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

చిల్పూరు: మండలంలోని కొండాపూర్ గ్రామంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరు ఎత్తుకెళ్లడంతో సంస్థకు రూ. 35 వేలు నష్టం వాటిల్లినట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో లో ఓల్టేజీ సమస్య నివారణ కోసం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వచ్చిన రైతులు కొండ తిరుపతి, గణేష్, శ్రీనివాస్ బోర్ మోటార్లను ఆన్ చేయగా పనిచేయకపోవడంతో లైన్‌మన్ కృష్ణంరాజుకు సమాచారం ఇచ్చారు. కాగా, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని ఫీజు పోయిందో చూడాలని సూచించారు. రైతులు వెళ్లి చూసి ట్రాన్స్ ఫార్మర్ కనిపించడం లేదని లైన్‌మన్‌కు తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న లైన్‌మన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు వేసి కాపర్‌వైరును చోరీ చేసినట్లు గుర్తించి ఏఈ లక్ష్మీనారాయణకు తెలుపగా ఆయన ఎస్సై నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి ఎస్సై చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

12 మూగజీవాల అపహరణ

వేలేరు : పన్నెండు మేకలు, గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాధితుడు బొజ్జ రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొజ్జ రాజు తనకున్న 150 గొర్రెలు, మేకలను రోజు మాదిరిగానే మేతకు తీసుకెళ్లి సాయంత్రం వ్యవసాయ బావి వద్ద గల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం చూడగా అందులో నుంచి 12 మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రామ సింహాలతో పరేషాన్

- చిన్నారులు, జీవాలు, దూడలపై దాడులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



బావుల వద్ద చెట్ల కింద నిద్రిస్తున్న కుక్కల గుంపు



బచ్చన్నపేటలో తిరుగుతున్న ఊర కుక్కలు, (ఇన్‌సెట్‌లో) కుక్కల దాడిలో గాయపడిన సాయి (ఫైల్)

బచ్చన్నపేట: రోజు రోజుకు ఊర కుక్కల దాడులు గ్రామాల్లో ఎక్కువవుతున్నాయి. వీధుల్లో ప్రజలు నడవాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా రోడ్లపై ఉంటూ అటుగా వెళ్లే వారిపైనే కాకుండా వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. అంతే కాకుండా పశువుల దొడ్లలో గ్రామసింహాలు జీవాలను చంపుతున్నాయి. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నాయి. అలాగే వ్యవసాయ బావుల వద్ద కట్టేసిన దూడలపై కుక్కల గుంపులు దాడి చేసి చంపేస్తున్నాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పాడి పశువులు పాలను ఇవ్వకపోవడంతో పాలఉత్పత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పాఠశాలలకు పిల్లలను పంపించాలన్నా ఎక్కడ కుక్కలు దాడులు చేస్తాయోనని భయపడుతున్నారు. కుక్కల బెడదను సంబంధిత అధికారులు నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా, ఇటీవల పోచన్నపేట గ్రామానికి చెందిన బాలుడు నిడిగొండ సాయి పాఠశాలకు వెళ్తుండగా కుక్కలు దాడి చేసి కరిచాయి. గమనించిన చుట్టుపక్కల వారు కుక్కలను వెళ్లగొట్టి సాయిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీంతో సాయిని పాఠశాలకు పంపించడం లేదని తల్లి సునీత తెలిపింది.

దూడలను కట్టేయాలంటే భయమేస్తోంది



వ్యవసాయ బావుల వద్ద దూడలను కట్టేసి రావాలంటే భయమేస్తోంది. కుక్కలు ఎక్కడ వాటిపై దాడిచేస్తాయోనని. ఇటీవల దూడపై కుక్కలు దాడి చేస్తుండగా దూడ అరుపులు విని వెంటనే అప్రమత్తం కావడంతో కుక్కలు పరుగెత్తాయి. లేక పోతే దూడను చంపేవి. పలువురు రైతుల దూడలను చంపేశాయి. దీంతో పాడి పశువులు పాలు ఇవ్వడం లేదు.

\- అరుకల శ్రీనివాస్, సదాశివపేట

కోతులు, కుక్కలతో బెంబేలు



రాత్రివేళ వీధుల్లో సంచరిస్తున్న వానరాలు

జనగామ రూరల్: పట్టణంలో కుక్కలు, కోతులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వానరాలు, శునకాలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంట్లోని, షాపుల్లోని తినుబండారాలను ఎత్తుకెళ్లి బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రివేళల్లో ప్రజలు బయటికి రావాలంటే ఎక్కడ అవి దాడులు చేస్తాయోనని భయపడుతున్నారు. వాటిని తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కుక్కలు, కోతుల బెడదను నివారించాలని పలువురు కోరుతున్నారు.



శునకాల గుంపు

కాంగ్రెస్ కైవసం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న హరిబాబుగౌడ్

- మండల ఇన్‌చార్జ్ హరిబాబుగౌడ్

బచ్చన్నపేట: స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లోని సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ బండకింది హరిబాబుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మాజీ ఎంపీటీసీ ఎండీ మసూద్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ అభ్యర్థులు దరఖాస్తు పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు దరఖాస్తులను స్వీకరించామన్నారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలకు 38 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమార్థం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. జంగిటి విద్యానాథ్,మాసపేట రవీందర్‌రెడ్డి, నల్లగోని బాలకిషన్‌గౌడ్,గుర్రపు బాల్‌రాజు, మట్టి బాల్‌రాజు, జిల్లా సందీప్, కర్రె నరేష్, అల్వాల ఎల్లయ్య, గౌస్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

తరిగొప్పుల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పన్నీరు రాజు, కాసులబాద ప్రశాంత్, సంపత్, సతీష్, మధుకర్, వేణుగోపాల్ రెడ్డి, రమేష్, సొంటెక్క కుమార్, తిరుపతి, రూపా, మంగ, మమత, శ్రీలత, బిచ్చ, మహేందర్, చందర్, మహేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసం ఎన్నికల బరిలో నిలుస్తాం..

- కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి



స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమావేశమైన అసంతృప్తి కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ కోసం పాటుపడిన క్యాడర్ వివక్షతకు గురైన తరుణంలో ఆత్మగౌరవం కోసం స్థానిక ఎన్నికల బరిలో పోటీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్వగృహంలో దేవరుప్పుల కాంగ్రెస్ అసంతృప్తి నాయకులతో సమావేశం నిర్వహించారు. కుట్రపూరిత రాజకీయాలతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడమేగాక ఎమ్మెల్యే గెలుపు కోసం పాటుపడిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను దినదినం పార్టీకి దూరం చేసి వలసవాదులకు పెద్ద పీట వేశారని ఆరోపించారు. అసలైన కాంగ్రెస్ వాదులు మనోవేదనకు గురౌతున్నా పట్టించుకున్న పాపానపోలేని తరుణంలో ప్రతిపక్ష పార్టీలోకి వెళ్లిపోయే దుస్థితులు నిదర్శనమన్నారు. బాధిత కాంగ్రెస్ వాదులకు బాసటగా నిలిచేందుకు జరుగబోయే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో తమ అనచురులు నిలుస్తారని స్పష్టం చేశారు. దేవరుప్పుల ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిని త్వరలో ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో చిలుకూరి నర్సయ్య, తోటకూరి రమేష్, గోలి మోహన్‌రెడ్డి, పాము వెంకన్న, గొడిశాల శ్రీను, భోనగిరి కిష్టయ్య, కారుపోతుల మహేందర్, చింత ఎల్లయ్య, ఉప్పుల అనిల్, జోగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దేశ హితమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



పథ సంచలనం కార్యక్రమంలో నరేందర్ తదితరులు

నర్మెట: సమాజ హితం, దేశ శ్రేయస్సు ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని, ఎలాంటి విపత్తు సంభవించినా ముందు వరుసలో ఉంటుందని జిల్లా కార్యవాహ బత్తుల నరేందర్ అన్నారు. మండలంలోని స్వయం సేవకులతో మండలకేంద్రంలో ఆదివారం పథ సంచలనం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలని సంఘం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో శారీరక ప్రముఖ్ క్రాంతి, గోసేవా ప్రముఖ్ మాధవ రెడ్డి, ఖండ కార్యవాహ వంగ రవి, ధర్మజాగరణ ప్రముఖ్ గోవర్ధన్, సభ్యులు ధరావత్ రాజు, ఆవుల శ్రీనివాస్, గుర్రాల రాములు, రాకేష్ బను, సాయినాథ్, వివిధ గ్రామాల సేవకులు పాల్గొన్నారు.

మినీ హాళ్లను అందుబాటులోకి తీసుకురావాలి



సమావేశంలో పాల్గొన్న కవులు, రచయితలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రధాన ఆడిటోరియానికి ఇరువైపులా ఉన్న మినీ హాళ్లను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థల బాధ్యులు కోరారు. ఈ మేరకు హనుమకొండలోని టీచర్స్ కాలనీ ఫేస్ -1 ప్రగతిమిత్ర కమ్యూనిటీ హాల్‌లో కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థలు, కవులు, రచయితల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆడిటోరియంలో చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలులేదని, ఈ క్రమంలో మినీ హాళ్లల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, కళాసాహిత్య స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, కవులు, రచయితలు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, నిధి, బిల్లా మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన భూక్య భద్రమ్మ (65) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందినది. కాగా బీఆర్‌ఎస్ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు, సరుకులను అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, మాజీ సర్పంచ్ రామిని శివరాజ్ గుప్తా, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, కొంపెల్లి రాజు, ధరంసోత్ కొంరెల్లి, గొల్లపల్లి మురళి, గుండేటి రాజశేఖర్, బాస్కుల రాజ్ కుమార్, నాగపురి రాజు, కొంపెల్లి రాజేష్, భూక్య సురేందర్, భూక్య మోహన్, కేలోత్ రమేష్, భూక్య రాజన్న తదితరులు పాల్గొన్నారు. ఉన్నారు.

జఫర్‌గఢ్‌లో..



నివాళులర్పిస్తున్న రాజయ్య

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన బాషబోయిన అంజయ్య (50) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

‘స్థానికం’లో గులాబీ జెండా ఎగరేయాలి



జనగామ రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న రాజు, సిద్దులు తదితరులు



పాలకుర్తి: మాట్లాడుతున్న నవీన్



దేవరుప్పుల: మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేసి కార్యకర్తలు సత్తా చాటాలని మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం అన్నారు. ఆదివారం యశ్వాంతాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పోటీ చేసే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూరెడ్డి ప్రమోద్ రెడ్డి, ప్రేమలత రెడ్డి, కొమ్మూరాజు, ఇరుగు సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలి

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ పడే ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నేడు (సోమవారం) మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో సమావేశాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

పాలకుర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగ పని చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. మండలంలోని వావిలాల గ్రామంలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. గిరగాని సమ్మయ్య, గంట పద్మర భాస్కర్, నల్లపు మౌనిక అశోక్, రాజు, వెంకన్న, పవన్, శ్రీను, లింగన్న, శాంతయ్య, ఆగయ్య, శంకరయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

సత్తా చాటుదాం..

రఘునాథపల్లి: సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటేలా శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కుర్ర కమలాకర్ పిలుపునిచ్చారు. అశ్వరావుపల్లిలో కుర్ర అంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుర్ర శ్రీనివాస్, సతీష్‌గౌడ్, కుడికాల శ్రీనివాస్, ఐలోని శ్రీకాంత్, నీల సారయ్య, భాస్కర్, రమేష్, నాగరాజు, సంపత్, భాను, వెంకటేష్, రమాకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు అనివార్యం

దేవరుప్పుల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేలా బీఆర్‌ఎస్‌ను గెలిపించడం అనివార్యమవుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు పెద్దమడూరు, కోలుకొండ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీటీసీ అభ్యర్థుల ఖరారు కోసం సన్నాహక ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు ఎల్లేష్, బండారి రాములు, లొడంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న పెరుమాండ్ల వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక చొరవతో పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో బీజేపీ నుంచి పోటీ చేయనున్నట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలన్నారు. తాళ్లపెల్లి శ్రీనివాస్, గట్టు కృష్ణ, ప్రశాంత్, ఉపేందర్, సారయ్య, నర్సింహరాములు, కె.శరత్‌కుమార్, గుగులోత్ మధు, గోనెల శ్రీనివాస్, గాదెపాక శ్రీను, సురేష్‌గౌడ్, కుమ్మం సతీష్, బుచ్చయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

జఫర్‌గఢ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల మండల కన్వీనర్ మారపల్లి రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పాటుపడుతున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కౌన్సిలర్ సభ్యులు ఎండి వలిపాష, నాయకులు మదన్‌మోహన్, గద్దం రాజు, మారపల్లి రవి, దుద్దుల చంద్రమౌళి, యాదగిరి పాల్గొన్నారు.

9న జాతీయ బృంద గీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న వరంగల్ దేశాయిపేట రోడ్డులోని నాగార్జున ప్రైమ్ స్కూల్‌లో పాఠశాలల జాతీయ బృంద గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒక గ్రూపు హిందీ, సంస్కృతం పాటలు, రెండో గ్రూప్ ప్రాంతీయ భాషా గీతాలు, జానపద గీతాలు పాడవచ్చని పేర్కొన్నారు. ఒకే గ్రూపు రెండు విభాగాల్లోనూ పాల్గొనే అవకాశం ఉందని, ఒక్కో గ్రూపులో 8మంది విద్యార్థులు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 12న హైదరాబాద్‌లో జరగబోయే బీవీపీ రాష్ట్ర స్థాయి జాతీయ బృంద గీతాల పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు వారు వివరించారు.